రాళ్ల బాటలో అక్షర వేట

అశ్వారావుపేట మండలం తాటినాగులగుంపునకు చెందిన వీరంతా పట్టుమని పదేళ్లు కూడా నిండని గిరిజన చిన్నారులు. 15 మంది బాలలు అక్షరాలు నేర్చుకునేందుకు గ్రామానికి కిలోమీటరు దూరంలోని దిబ్బ గూడెం ప్రాథమిక పాఠశాలకు కాలినడకన వెళ్లి వస్తున్నారు. నాలుగేళ్ల కిందట ఈ రెండు గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేయడంతో మట్టిరోడ్డును తవ్వి కంకర పరిచారు. ఏళ్లు గడిచినా బీటీ వేయకపోవడంతో కంకర రాళ్లు బయటపడ్డాయి. ఈ దారిలో బడికి వెళ్లి రావాలంటే ఎంతో కష్టంగా ఉందని చిన్నారులు వాపోతున్నారు. వీరిలో కొందరు చెప్పులు లేకుండా కూడా ఉన్నారు. రాళ్ల బాటలో బాలలు నడుచుకుంటూ బడికి వెళ్తున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

– న్యూస్‌టుడే, అశ్వారావుపేట గ్రామీణం

గుత్తేదారుకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

ఐటీడీఏ ఏఈ ప్రసాద్

మెడికల్ బోర్డులో అవినీతికి చెక్

దళారుల వసూళ్లకు తెర

ఈనాడు, కొత్తగూడెం డిజిటల్

అక్రమాలకు కేంద్రంగా మారిన సింగరేణి మెడికల్ బోర్డులోని అవినీతికి చెక్ పడింది. ఫలితంగా డబ్బులిచ్చి అన్‌ఫిట్ కావాలనుకునే వారికి బ్రేకులు పడుతున్నాయి. గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న బోర్డులో కనీసం 25 శాతం మంది కూడా అన్‌ఫిట్ కాలేదు. దీంతో అడ్డదారులు తొక్కి వచ్చే వారు వెనకడుగేస్తున్నారు. గతంలో కార్మికుల నుంచి దళారులు, పలు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడేవారు. ప్రతిసారి 70-80 శాతం మందిని అన్‌ఫిట్ చేయించేవారు. అందులో సగానికిపైగా అక్రమ లావాదేవీలు జరిగేవి. ఫలితంగా కొంచెం లోపం ఉన్న వారు కూడా అక్రమార్కులతో పనులు చేయించుకునేవారు. తాజాగా ఆ అవకాశం లేకపోవడంతో జులైలో 28, ఆగస్టులో 49 మంది కార్మికులు అసలు బోర్డుకే హాజరుకాలేదు.

అసంతృప్తి.. ఆరోపణలు

పారదర్శకంగా నిర్వహిస్తుండటంతో దళారులు, పలువురు నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో అన్‌ఫిట్ చేయిస్తామంటూ ఒక్కో కార్మికుడి వద్ద రూ.లక్షల్లో వసూళ్లు చేసేవారు. దళారులు లేనిదే పని కాదనే పరిస్థితికి తీసుకొచ్చారు. అర్హులు కూడా వారినే ఆశ్రయించేవారు. నూతన విధానంతో కార్మికుల్లో అసంతృప్తి నెలకొందని, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికే చేస్తున్నారంటూ సంస్థపై ఆరోపణలు చేస్తున్నారు. యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతామంటూ కార్మికులకు చెబుతున్నారు. అవినీతిని మళ్లీ మొదలుపెట్టాలని చర్చలు జరుపుతారా? అంటూ కొందరు కార్మికులు విమర్శిస్తున్నారు.

మూలకుపడ్డ అనిశా విచారణ..

అవినీతి పెచ్చుమీరడం, విపరీతమైన విమర్శలు రావడంతో సంవత్సరంన్నరకు పైగా మెడికల్‌బోర్డును నిర్వహించలేదు. సంస్థకు చెందిన పై స్థాయి ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలతోపాటు బయటి నుంచి పలువురు దళారులు అక్రమాల్లో కీలకంగా వ్యవహరించారు. వారందరిపై అనిశా విచారణ చేపట్టింది.

◆ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు డ్రైవరు, సెక్యూరిటీ గార్డు, ల్యాబ్ టెక్నీషియన్‌లపై కేసులు నమోదు చేశారు. ఇంతవరకు ఒక్క ఉన్నతాధికారిని కూడా పట్టుకోకపోవడం గమనార్హం.

అక్రమాలకు ఆస్కారం లేకుండా..

మెడికల్ బోర్డుకు వచ్చే కార్మికుల ఆరోగ్య పరీక్షలను గతంలో సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యులు నిర్వహించేవారు. అవినీతి ఆరోపణలు పెరగడంతో ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో చేయిస్తున్నారు. వారికి కూడా బోర్డును నిర్వహించే రెండ్రోజుల ముందే సమాచారం ఇస్తున్నారు. ఎక్కడి నుంచి వచ్చారనే వివరాలు కూడా తెలియడంలేదు. అక్రమాలకు ఆస్కారం లేకుండా పోయింది. దళారులకు ఎవరిని ఆశ్రయించాలో తెలియని పరిస్థితి.

భూమి లేకున్నా రైతు భరోసా.. అడవులకూ రుణాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అక్రమ పోడు పట్టాలపై నిర్ణయం తీసుకోవడానికి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భూమి లేనివారు, పోడుకు గురికాని ఏపుగా పెరిగిన అటవీ ప్రాంతాలపైన పట్టాలు జారీ కావడంతో వాటి ద్వారా రైతుబంధు (భరోసా), బీమా, ఇతర సంక్షేమ పథకాల ద్వారా అనర్హులు ఏటా రూ.కోట్లు కాజేస్తున్నారు. నకిలీలు బ్యాంకుల్లో రుణాలు పొందారు. ఎక్కువ సంఖ్యలో పట్టాలు ఉండటంతో అటవీ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి అందించి నిర్ణయం కోసం వేచిచూస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు ఇలా..

అక్రమ పట్టాలు	సంఖ్య
ఒకే భూమిపై ఇద్దరిపేర్లు	482
మాన్యుప్లేట్	1984
నిండుగా చెట్లున్న అడవి	1123
అటవీశాఖ ప్లాంటేషన్	814

ఈనాడు, ఖమ్మం

17,808 ఎకరాలకు అనవసర లబ్ధి

■ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, గ్రామాల్లో ఇంటి వెనక పెరటి స్థలానికి పట్టాలు ఇచ్చారు. వాస్తవంగా సాగయ్యే భూమి కంటే ఎక్కువ మొత్తానికి రైతుబంధు(భరోసా) నిధులు విడుదలవుతున్నాయి.

■ 2009లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన భూముల్లో కొన్నింటికి 2022లోనూ మళ్లీ పట్టాలు ఇచ్చారు. ఒక సర్వే నంబరులోని భూమిపై ఇద్దరి పేర్లు ఉన్నాయి. వారిద్దరికీ రైతుభరోసా నిధులు జమ అవుతున్నాయి.

■ 2022 నుంచి ఇప్పటి వరకు పోడు పట్టాలపై పెట్టుబడి సాయం కింద ఐదు సార్లు రైతుబంధు (భరోసా) నిధులు విడుదల కాగా.. రూ.44.50 కోట్ల మేర అనర్హుల బ్యాంకు ఖాతాలో జమైనట్లు తెలుస్తోంది.

■ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకే భూమిపై ఇద్దరి పేర్లు ఉండటం, అడవి, ప్లాంటేషన్ భూములకు సంబంధించి సుమారు 5,088 మందికి 17,808 ఎకరాలకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు జారీ చేసినట్లు అటవీ శాఖ క్షేత్రస్థాయి తనిఖీలో వెల్లడైంది.

విచారణ చేస్తున్నాం..

దివాకర టీఎస్, ఖమ్మం జిల్లా కలెక్టర్

ప్రస్తుతం కొన్ని పట్టాలపై ఫిర్యాదుల రావడంతో విచారిస్తున్నాం. అక్రమంగా జారీ చేసిన పట్టాలపై అటవీ శాఖ క్షేత్రస్థాయిలో విచారించి రూపొందించిన నివేదిక నా దృష్టికి రాలేదు.

46.89 శాతం మంది మాత్రమే అర్హులు..

◆ భద్రాద్రి జిల్లా పరిధిలో 56,388, ఖమ్మం జిల్లా పరిధిలో 12,154 మంది పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, 2009, 2022లో అప్పటి ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం కింద (ఆర్‌ఓఎఫ్‌ఆర్) పట్టాలు జారీ చేశాయి. వీటిపై ఇటీవల అంతర్గతంగా విచారణ జరిపిన జిల్లా అటవీ శాఖ అధికారులు జిల్లాల వారీగా నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించారు.

◆ ఉమ్మడి జిల్లాలో 36,434 మంది 2005 తర్వాతనే అడవులను నరికి పోడు చేసుకున్నట్లు గుర్తించారు. అంటే ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందడానికి అర్హత ఉన్నవారు 32,145 మంది మాత్రమే. మొత్తం సంఖ్యలో 35,206 మందికి పట్టాలు ఇవ్వడానికి జిల్లా అటవీ శాఖ అధికారులు ఎలాంటి సిఫార్సు చేయలేదని తేల్చారు.

పరిశోధన

ఏదీ నిఘా.. ఇదిగో దగా

భద్రాచలం కేంద్రంగా భారీగా అక్రమాలు

భద్రాచలం, న్యూస్‌టుడే

ఎక్కడ ఏం జరిగినా సర్కార్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక నిఘా వర్గాలు ఉన్నా కొన్ని సార్లు ఆయా ప్రాంతాల్లో ఇవి నిద్రావస్థలో ఉన్నాయా? అనే అనుమానం కలుగుతోంది. ఇందుకు ఉదాహరణగా భద్రాచలం కేంద్రంగా కొంతకాలంగా జరుగుతున్న వరుస సంఘటనలనే పలువురు ప్రస్తావిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాలు పోలీస్ బాస్‌లకు సమాచారం చేరవేస్తున్నాయా? లేక ముందే విషయాన్ని చెప్పినా వేచి చూసే ధోరణిలో ఉంటున్నాయా? అన్న ప్రశ్న కలవరపెడుతోంది.

'ఈనాడు' కథనంతో కదిలిన డొంక

గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు 4న పట్టుబడ్డారు. వీరిని భద్రాచలం ఆబ్కారీ స్టేషన్‌లో అప్పగించారు. ఇందులో ఒకరు పరారైనా ఆ విషయాన్ని కప్పిపుచ్చి ఎలాంటి జంకు లేకుండా ఒక్కరినే రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై 'ఈనాడు'లో 7న కథనం ప్రచురితం కావడం ఆబ్కారీ శాఖలో సంచలనమైంది. ఒక్కసారిగా నిఘావర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఈ కథనం తర్వాత శాఖాపరమైన విచారణ చేపట్టి ఆబ్కారీ శాఖ సీఐ రహీమున్నీసా బేగం, కానిస్టేబుల్ రవికుమార్‌ను సస్పెండ్ చేసి సూపరింటెండెంట్‌ను సరెండర్ చేశారు.

ఇవిగో సంఘటనలు

● భద్రాచలం ఎమ్మెల్యే పీఏ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. కొందరికి చెక్కులను ఇవ్వడంతోపాటు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సృష్టించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసి రూ.6 కోట్లకు పైగా సొమ్ము చేతికందగానే పరారయ్యాడు. ఈ దందా నెలల తరబడి కొనసాగింది. బాధితులు అడపాదడపా ఘర్షణ పడుతూనే ఉన్నారు. దీనిపై ముందే పసిగట్టి అప్రమత్తం చేసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదు.

● ఓ వ్యాపారి ఎక్కువ వడ్డీ ఎరవేసి పలువురి నుంచి రూ.50 కోట్లకు పైగా పెట్టుబడి రూపంలో తీసుకున్నాడు. జేబులు నిండగానే కుటుంబంతోపాటు కేరళ పారిపోయాడు. బాధితుల సంఖ్య పెరగడంతో కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని పట్టుకొని అరెస్ట్ చేశారు. ఇది కూడా చాలాకాలంగా జరిగిందే.

● ఇసుక ర్యాంప్‌లను ఇప్పిస్తామని ఒకరు భారీ స్థాయిలో డబ్బులు వసూలు చేయడంతో కొన్ని రోజుల కిందట పెద్ద గొడవైంది. తర్వాత దీనిపై ఎలాంటి సెటిల్‌మెంట్ అయిందన్నది బయటకు రాలేదు.

● తన సంస్థ పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న మరో ప్రముఖుడు సైతం వడ్డీకి భారీ స్థాయిలో అప్పులు తీసుకొని వేరే చోట మకాం పెట్టాడు. ఇచ్చిన మొత్తం ఏదో ఒక విధంగా ఇస్తే చాలు వడ్డీ లేకపోయినా పర్వాలేదని బాధితులు వాపోతున్నారు. ఇది దేనికి దారి తీస్తుందో అంతు చిక్కడం లేదు.

ఒకటి, రెంటికి అవస్థలు

ఈనాడు పరిశీలన

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు:	1,062
మరుగుదొడ్లు	3,297
మూత్రశాలలు:	4,257
రెండు అవసరమైనవి:	297
మొత్తమే లేని బడులు:	10

ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండాలని ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి, 20 మంది చొప్పున ఒకటి మూత్రశాల ఉండాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్న చోట నీటి సౌకర్యం లేకపోవడంతోపాటు నిర్వహణ కొరవడింది. విద్యార్థుల ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

బాలుర మరుగుదొడ్లలో బాలికలు

◆ **పాఠశాల పేరు:** పాత పాల్వంచ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల
◆ **విద్యార్థులు:** మొత్తం 69 మంది (బాలురు 30, బాలికలు 39)
◆ **ప్రస్తుత పరిస్థితి:** పాఠశాలలో నవభారత్ సంస్థ సీఎస్‌ఆర్ పాలసీలో భాగంగా బాలురకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. బాలికలకు మాత్రం లేవు. బాలుర అనంతరం బాలికలు వాటినే వినియోగించాల్సిన దుస్థితి. మూత్రశాలలు లేవు. – న్యూస్‌టుడే, పాల్వంచ

ఆ అవసరాలకు ఇంటికే

◆ రాంపురం ప్రాథమిక పాఠశాల
◆ 21 మంది (బాలురు 11, బాలికలు 10)
◆ చుంచుపల్లి మండలంలో మరుగుదొడ్డి, మూత్రశాలలు లేని పాఠశాల ఇదే. ఇక్కడ బాలబాలికలు మురుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఒంటికి, రెంటికి ఇంటి బాట పట్టాల్సిందే. – న్యూస్‌టుడే, పాల్వంచ

బాలురు ఆరుబయటే అన్నీ..

◆ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆళ్లపల్లి
◆ 104 మంది (బాలురు 64, బాలికలు 40)
◆ పాఠశాలలో బాలికలకు ఒక బ్లాక్ మురుగుదొడ్లు ఉన్నాయి. కానీ బాలురు మాత్రం ఒంటికి, రెంటికి ఆరుబయటే. కనీసం ఒక్క మరుగుదొడ్డి, మూత్రశాలలు లేవు.

– న్యూస్‌టుడే, ఆళ్లపల్లి

ఉన్నదీ మరుగున పడింది..

◆ జేబీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల
◆ మొత్తం 208 (బాలురు 170, బాలికలు 38)
◆ బాలికల మరుగుదొడ్లు ఉన్నాయి. బాలురకు కేవలం ఒకటే మూత్రశాల ఉంది. కనీస నిర్వహణ లేక దుర్వాసన వస్తోంది. ఎవరూ వినియోగించక పిచ్చిమొక్కల మధ్య ఉంది. ఫలితంగా బాలురు బయటకే వెళ్తున్నారు. – న్యూస్‌టుడే, ఇల్లెందు

సర్ ప్రక్రియ వేగవంతం చేయండి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అనామొలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసులు జారీ చేసి యాప్ వివరాలు నవీకరించాలన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

రీల్స్ చేస్తూ.. చైతన్యం కలిగిస్తూ

● 'చరవాణి'తో యువ వైద్యుల అవగాహన

వైద్య సేవలంటే ఆసుపత్రి గదులు, రోగుల పరీక్షలు, చికిత్సలకే పరిమితం కావాల్సిన అవసరంలేదని కొందరు యువ వైద్యులు నిరూపిస్తున్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రీల్స్, షార్ట్ వీడియోల ద్వారా క్లిష్టమైన వైద్య విషయాలను సైతం సామాన్యులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. అపోహలను తొలగించడం, వ్యాధుల ప్రారంభ దశలోనే గుర్తించేలా కుటుంబ సభ్యులందరినీ చైతన్యపరచడం వీరి ప్రధాన లక్ష్యం.

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

మహిళలకు సంబంధించి..

- డాక్టర్ జి.ఆర్.గ్రీష్మ, గైనకాలజిస్ట్

మహిళలు వారి ఆరోగ్య సమస్యలను బయటకు చెప్పుకోవడానికి చాలా సందర్భాల్లో ఇష్టపడరు. దీంతో సమస్య ముదిరే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మార్చిలో ఒక చిరు ప్రయత్నంగా రీల్స్ చేయడం ప్రారంభించా.. ఫాలోవర్స్ నుంచి వచ్చిన స్పందన చూసి దానిని కొనసాగిస్తున్నా. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే వ్యక్తులే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కలిగి ఉండాలన్నదే నా ఉద్దేశం.. ఇప్పటివరకు 1.16 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఆధునిక వైద్య చికిత్సలపై అందరిని చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నా.

హానికర అలవాట్లను అడ్డుకునేలా

డాక్టర్ కాట్రగడ్డ యమున, పల్మనాలజిస్ట్

పొగ, మద్యం తాగడం వంటి అలవాట్లను కొనసాగిస్తే ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతాయి.. మధ్యలో మానేసిన వారిని సైతం ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదముంది. ముందస్తు వైద్య పరీక్షలతో సంబంధిత ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చు. చికిత్స కోసం వచ్చే బాధితులకు అన్నీ వివరిస్తాం. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతి ఒక్కరిని అప్రమత్తం చేసే అవకాశముంది. ఇన్‌స్టా వేదికగా కొన్ని నెలల క్రితం చేసిన ప్రయత్నానికి వేల మంది నుంచి స్పందన లభించడంతో తీరిక సమయాల్లో రీల్స్ చేస్తున్నా.

పిల్లల జీవనశైలిపై దృష్టి

డా.యాలమూడి గౌతమ్, పీడియాట్రిషియన్

ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా పిల్లల వ్యాధులు, వారి ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం ప్రారంభించా. ప్రస్తుతం 10.60 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రారంభ దశలో రీల్స్, వీడియోలు చేయడం మొదలుపెట్టా. స్పందన రావడంతో ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నా. ఉత్తరాది రాష్ట్రాల్లో వైద్యులు చేస్తున్న ప్రయత్నాలు గమనించి నేనూ రీల్స్ చేస్తున్నా. పిల్లల సమస్యలే కాకుండా జీవనశైలి, బరువు తగ్గడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నా.

నియంత్రిక ఒరిగింది.. ప్రమాదం పొంచి ఉంది

కోయగూడెం పంచాయతీ పరిధిలో ఓ పత్తిపొలంలో విద్యుత్ నియంత్రిక దిమ్మె పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. గాలి, వర్షాలకు కిందడే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దిమ్మెను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

– సుజాతనగర్, న్యూస్‌టుడే

పర్యాటక, క్రీడా అభివృద్ధిపై మంత్రి సమీక్ష

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న పర్యాటక, క్రీడాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, అందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం జరిపిన సమీక్షా సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎం.డి. సోనీ బాల, పర్యాటకశాఖ ఎం.డి. గౌతమితో మాట్లాడారు. ప్రారంభించిన పనుల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగూడెం యూనివర్సిటీలో స్టేడియం, ఖిల్లా రోప్ వే, హరిత భవన్ నిర్మాణ పనులు కొలిక్కి రావాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించతలపెట్టిన స్టేడియం ప్రాజెక్టుకు డీపీఆర్‌కు త్వరితగతిన మంజూరు ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ITI SPOT ADMISSIONS

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥రమునకు రూ. 16,500/- మాత్రమే. ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డీజిల్ మెకానిక్. 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.
మిగతా వివరాలకు
మార్కొని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

WANTED

1. PALM OIL PRODUCTION MANAGER: With 5 Years Experience able to manage Production Activities to work in Ghana, West Africa
2. PALM PLANTATION SUPERVISORS: Having Experience in Growing Palm Plantation to work in Ghana, West Africa.

Contact:9494959595
Email: rvripl@gmail.com
Address:
2-1-59, Opp:Subhadra Arcade Complex, 4th floor, Bhanugudi Junction, Kakinada-533004

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్తు బిల్లు చెల్లింపు

భద్రాచలం పట్టణంలో విద్యుత్తు శాఖ వినియోగదారులకు విద్యుత్తు బిల్లుల చెల్లింపులు సులభతరం చేసేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. పెండింగ్ బిల్లులు వసూలు చేసే ఓ సిబ్బంది ఇలా తన వాహనానికి క్యూఆర్ కోడ్‌ల స్టిక్కరు అంటించుకున్నారు. బకాయిలు ఉన్న వినియోదారులు చరవాణి ద్వారా నేరుగా బిల్లును చెల్లిస్తున్నారు. చరవాణికి మెసేజ్ వస్తుందని ఆ శాఖ ఏఈ రాజారావు తెలిపారు. పట్టణంలో పలు చోట్ల క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించినట్లు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం పట్టణం

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

● జిల్లా పంచాయతీ అధికారి అనూష

ఈనాడు ఫోన్ ఇన్

లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, న్యూస్‌టుడే

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని జిల్లా పంచాయతీ అధికారి అనూష తెలిపారు. శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్'కు జిల్లాలోని పలువురు తమ గ్రామాల్లో సమస్యలను ఆమెకు వివరించారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకొంటానని ఆమె హామీ ఇచ్చారు.

? మేముండే ప్రాంతంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. కాల్వల్లో బ్లీచింగ్ చల్లడం లేదు.
– బొల్లి సరోజని, రిక్షా కాలనీ, భద్రాచలం, రామారావు, చంద్రుగొండ
డీపీవో: ఫాగింగ్ చేపట్టేలా చర్యలు తీసుకొంటాను.

? సంజయ్‌నగర్ పంచాయతీ పంపు బావి వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి వస్తోంది. - **రాజు, రమాదేవి, సాయిప్రసాద్, హరి, సంజయ్‌నగర్, (లక్ష్మీదేవిపల్లి)**
● కాల్వ నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో పలుమార్లు మాట్లాడాను. అక్కడ ఎత్తుగా ఉండడంతో కాల్వ నిర్మాణ పనులకు బడ్జెట్ కన్న అధిక వ్యయమవుతుంది. గుత్తేదారులు రావడం లేదు. దీనిపై మరోసారి అధికారులతో మాట్లాడతాం.

? మా ఇంటి పక్కన ఓ వ్యక్తి కొనుగోలు చేసిన స్థలం ఖాళీగా ఉంచారు. పిచ్చి చెట్లు పెరిగి పాములు వస్తున్నాయి. - **లలిత, ఆదర్శనగర్, భద్రాచలం**
● శుభ్రం చేసేలా చర్యలు తీసుకొంటాను.

? మిషన్ భగీరథ తాగునీరు వారం రోజులుగా సరఫరా కావడం లేదు. ట్రాక్టర్ల రాకపోకలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు కింద పైపులు పగిలిపోయాయి. – **మేడిచర్ల వెంకటరమణ, రేగళ్ల, (లక్ష్మీదేవిపల్లి)**
● తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీ సమస్యపై మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ మాట్లాడి పరిష్కారం చూపుతాను.

? కొత్తగూడెం కార్పొరేషన్ మురుగునీరు శ్రీనగర్, అశోక్‌నగర్ పంచాయతీల గుండా, లక్ష్మీదేవిపల్లిలోని కళాశాలల మురుగునీరంతా మొర్రేడు వాగులో కలుస్తోంది. కొందరు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు.
- **లగడపాటి రమేశ్, 5వ వార్డు సభ్యుడు, శ్రీనగర్(లక్ష్మీదేవిపల్లి)**
● పరిశీలించి చర్యలు తీసుకొంటాను. పంచాయతీ వారు స్థలం చూపితే సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం.

? మా ప్రాంతంలో రోడ్లపైకి మురుగు వస్తోంది. కాల్వలను సరిగా శుభ్రం చేయడంలేదు. దోమలు వ్యాపిస్తున్నాయి.
- నరసింహరావు, విద్యానగర్, (చుంచుపల్లి), మహేశ్వరరావు, సారపాక, లావుడ్యా బావ్‌సింగ్, హర్యాతండా, (లక్ష్మీదేవిపల్లి), ప్రకాశ్, కోయగూడెం, (సుజాతనగర్)
● పంచాయతీ అధికారులతో మాట్లాడి మురుగు కాల్వలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకొంటాను.

? మా పంచాయతీలో డీజిల్ బిల్లు రావడం లేదని చెత్త ట్రాక్టర్ సక్రమంగా తిరగడం లేదు. - **ఎన్.కె.నగర్, చుంచుపల్లి**
● ట్రాక్టర్ తిప్పాలని పంచాయతీ వారిని ఆదేశించాను. సమస్య లేకుండా చూస్తాను.

ఈనాడు కార్యాలయాలలోగాని, మీ దగ్గరలోని ఏజెంట్‌ను గాని సంప్రదించండి.
★ ఖమ్మం: 8008510764, 8008709925, 8008709924
★ కొత్తగూడెం, పాల్వంచ: 8008709920 ★ ఇల్లెందు, మధిర: 8008510764
★ మణుగూరు, భద్రాచలం: 8247668656 ★ పాలేరు: 8008709924
★ సత్తుపల్లి, అశ్వారావుపేట: 8008001776 ★ వైరా: 8008709925

(c) eenadu

ఈ శ్రావణ మాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో.. సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం

నేడు, రేపు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగ అవివాహితులకు సువర్ణావకాశం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లి పందిరి' అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగ అవివాహిత వధూవరులకు **ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్** కార్యక్రమం. వివాహం కోసం ఎదురు చూస్తున్నవారు, సంబంధిత కుటుంబీకులు నేడు, రేపు (ఆదివారం 30, సోమవారం 31, ఆగస్టు 2026) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను క్రింద తెలిపిన ఫోన్ నంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

95501 28306 & 83744 45190

చేరికలు అంతంతే..!

ముగిసిన ఎప్‌సెట్ 'ఇంజినీరింగ్' ప్రవేశాల ప్రక్రియ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈసారి ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని మినహా మిగతా వాటిల్లో పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఖమ్మం జిల్లాలోని పాలేరు జేఎన్‌టీయూ, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వ కళాశాలలు కాగా, ఈ సంవత్సరం కొత్తగా మధిరకు జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. మొత్తం 11 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి.

2,262 సీట్ల భర్తీ: ఎప్‌సెట్ మొదటి, రెండో, మూడో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యింది. అదే విధంగా స్పాట్, యాజమాన్య కోటా ప్రవేశాల భర్తీ ప్రక్రియ సైతం పూర్తిచేశారు. ఇక కళాశాలల్లో ప్రవేశాలు తీసుకునే అవకాశం లేదు. ఇప్పటివరకు చూస్తే ఉభయ జిల్లాల్లో మొత్తం 3,561 సీట్లకు కేవలం 2,262 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సుమారు మూడు లేదా నాలుగు ప్రైవేటు కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు ఆశాజనకంగా ఉండగా మిగతా వాటిలో పెద్ద సంఖ్యలో ఖాళీలు మిగిలిపోయాయి.

ఈసారి సీఎస్ఎంకు డిమాండ్... గత ఏడాది సీఎస్‌సీఈ, సీఎస్ఎం బ్రాంచిలకు అధిక ప్రాధాన్యం ఉండగా ఈసారి సీఎస్ఎం బ్రాంచి సీఎస్ఈని వెనక్కు నెట్టింది. తర్వాత డేటా సైన్స్‌పై ఎక్కువ ఆసక్తి చూపారు. యాజమాన్య కోటాలో సీట్ల పరిస్థితి సైతం ఇదేవిధంగా ఉండటం విశేషం. కోర్ బ్రాంచిల్లో ఈసీఈ పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉండగా, మిగతా వాటి పరిస్థితి అంతంతమాత్రంగానే మారింది.

పాలేరు పరిస్థితి దయనీయం... జేఎన్‌టీయూహెచ్-పాలేరు పరిస్థితి ఈసారి మరీ దయనీయంగా ఉంది. మొత్తం 300 సీట్లకు కేవలం 56 మంది మాత్రమే చేరటం గమనార్హం. వీటిలో సీఎస్‌డీ-15, సీఎస్ఈ-21, ఈసీఈ-15, ఈఈఈ-03, మెకానికల్-02 చొప్పున చేరారు. కళాశాల ప్రారంభమైన నాలుగేళ్ల తర్వాత ఇంత తక్కువగా సీట్లు భర్తీ కావటం ఇదే మొదటిసారి. కేటాయించిన 56 మందిలో 42 మంది మాత్రమే ఇప్పటివరకు హాజరయ్యారు. వసతులు సరిగా లేవనే కారణంగా ఇతర విద్యార్థులు ఇక్కడ చేరలేదని సమాచారం.

జేఎన్‌టీయూహెచ్-పాలేరు కళాశాల

మధిరలో వచ్చే ఏడాది నుంచి... మధిరకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కౌన్సెలింగ్ ప్రక్రియ తుది దశలో మంజూరైంది. చాలామంది విద్యార్థులు ఇక్కడ కళాశాలను ఎంపిక చేసుకోలేదు. దీంతో జేఎన్‌టీయూ పాలకమండలి కూడా ప్రవేశాలను వచ్చే ఏడాదికి వాయిదా వేసింది.

ఇతర ప్రాంతాలపై ఆసక్తి.. ఉమ్మడి జిల్లాకు చెందిన అనేకమంది ఎప్‌సెట్ టాప్ ర్యాంకర్లలో కొంతమంది హైదరాబాద్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు పొరుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరుతున్నారు. స్థానికంగా ఉన్న కళాశాలల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో మాత్రమే ఎక్కువ మంది చేరుతున్నారు.

యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈఓ దామోదర్‌రావు

కియోస్క్ సేవలు ప్రారంభం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయం పరిధిలో కియోస్క్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎస్‌బీఐ సహకారంతో యంత్రాన్ని ఆలయ సమాచార విభాగంలో ఏర్పాటు చేశారు. ఈఓ దామోదర్‌రావు శనివారం ప్రారంభించి డిజిటల్ స్మార్ట్ టిక్కెట్‌ను తీసుకున్నారు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రసాదాలు, దర్శనం, విరాళాల విభాగాలు ఉంటాయి. తెరపై ప్రసాదం ట్యాబ్‌పై టచ్ చేస్తే ఎన్ని లడ్డూలు కావాలో అడుగుతుంది. ఎంచుకోగానే స్కానర్ కనిపిస్తుంది. సరిపడా మొత్తాన్ని చెల్లించిన తర్వాత టోకెన్ వస్తుంది. అది కౌంటర్ చూపిస్తే లడ్డూలు ఇస్తారు. భక్తులు విరాళాలూ ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. రూ.100 ప్రత్యేక దర్శనం టికెట్ పొందవచ్చు. దీని ద్వారా భక్తులకు సమయం ఆదా అవుతుందని ఆలయవర్గాలు చెబుతున్నాయి. కియోస్క్ యంత్రంలో కొద్ది సేపు సాంకేతిక చిక్కులు తలెత్తాయి. కొన్ని రకాల సేవలు కనిపించలేదని తెలిసింది. చిన్నపాటి సాంకేతిక సమస్య వల్ల ఇలా అయి ఉంటుందని, నిపుణులను పంపి బాగు చేయించామని ఆలయ వర్గాలు తెలిపాయి.

ర్యాక్ పాయింట్‌కు ఎరువుల రాక

చింతకాని, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే ర్యాక్ పాయింట్‌కు 2327 మెట్రిక్ టన్నుల యూరియా, 319 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు శనివారం వచ్చాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. యూరియాలో ఖమ్మం జిల్లాకు 1127 టన్నులు, భద్రాద్రి జిల్లాకు 600, మహబూబాబాద్ జిల్లాకు 500, ఖమ్మం సీఆర్పీకి 100 టన్నులు కేటాయించినట్లు ఆయన వివరించారు. దీంతోపాటు 319 టన్నుల 20.20.0.13 రకం కాంప్లెక్స్ ఎరువు వచ్చిందని పేర్కొన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువును లారీల ద్వారా ఆయా జిల్లాల్లోని సహకార సంఘాలకు, ఎరువుల దుకాణాలకు పంపిణీ చేశారు.

పుష్కర ఘాట్ పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన పూజలో ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఈఓ దామోదర్‌రావు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం గోదావరి వద్ద నూతన పుష్కర ఘాట్‌ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన పూజ నిర్వహించారు. కరకట్ట దిగువన వరద సూచీల ప్రాంతంలో ఎంపిక చేసిన చోట జేసీబీ ద్వారా మట్టిని తవ్వి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు నిర్వహించే పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్నానాలు చేసేందుకు సర్కార్ ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ఇందు కోసం రూ.46.65 కోట్లను మంజూరు చేసిందని, ప్రధాన ఘాట్‌కు రెండు వైపులా కొత్త ఘాట్‌లను ఏర్పాటు చేసి సుందరీకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కరకట్ట విస్తరణతో పాటు సర్వీస్ రోడ్డు రామాయణ బొమ్మల ఏర్పాటు ఉంటుందన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. 3 విడతల్లో పుష్కర పనులు చేపట్టామని ఇందులో మొదటి విడత భద్రాచలంలో ఉండగా రెండు, మూడు విడతల్లో పర్ణశాల, మోతె వంటి ఘాట్‌లు ఉన్నాయని మొత్తంగా రూ.49.75 కోట్లతో ఘాట్‌ల నిర్మాణం ఉంటుందని తెలిపారు. ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సర్పంచి కృష్ణ, ఈఓ దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ శాఖ ఈఈ జానీ పాల్గొన్నారు.

పరమానంద భరితం.. రామయ్య కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రుడికి అర్చకులు శనివారం సుప్రభాత సేవ చేసి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించి వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం కొనసాగించారు. పవిత్రోత్సవాల కారణంగా అయిదు రోజులపాటు నిలిచిన నిత్య కల్యాణం తిరిగి ప్రారంభమైంది. మాంగళ్య ధారణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాల వేడుక నిర్వహించారు. దర్బారు సేవ తన్మయత్వంలో ముంచెత్తింది. భక్తులు విశేష సంఖ్యలో తరలి వచ్చి ప్రధాన ఆలయంలోని ధ్రువమూర్తులతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలను అందించారు. ఆదివారం అభిషేకం ఉంటుంది.

31 నుంచి సామాజిక చైతన్య నాటకోత్సవాలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో సామాజిక చైతన్య నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.దేవేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాయంత్రం 6 గంటలకు నాటక ప్రదర్శనలు జరుగుతాయని, అభ్యుదయ, సామాజిక, ప్రజాస్వామ్యవాదులు, కళాకారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

31న ఆహార లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా

పాల్వంచ, న్యూస్‌టుడే: ఆహార లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందే ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ నెల 31న మేళా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఆహార భద్రతశాఖ అధికారి శరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు, బేకరీలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, వీధి ఆహార విక్రయదారులు, ఆహారం తయారీదారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేదిక పాల్వంచలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉంటుందన్నారు.

జలజలా తరలివస్తున్న కృష్ణమ్మ

★ పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నీరు

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన కృష్ణాజలాలు పాలేరు రిజర్వాయర్‌కు చేరుకుంటున్నాయి. దీని నుంచి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ప్రజలకు తాగునీటిని అందించనున్నారు. మూడు రోజుల క్రితం సాగర్ ఎడమ కాలువకు డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. పాలేరు రిజర్వాయర్‌కు శనివారం రాత్రికి సాగర్ నీరు చేరుకోనుంది. శనివారం సాయంత్రం వరకు నీటి మట్టం 15.90 అడుగులు ఉంది. ఇక్కడ 23 అడుగుల వరకు సాగర్ నీటితో నింపేందుకు నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటి ప్రవాహం వచ్చి చేరుతుందని, నాలుగు రోజుల్లో నిండుతుందని అంచనా వేస్తున్నారు.

తాగునీటికి ఢోకా లేదు.. పాలేరు జలాశయం ఒక్కసారి 23 అడుగుల వరకు నీటితో నింపితే మూడు జిల్లాలకు సుమారు 150 రోజుల వరకు తాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. పాలేరు రిజర్వాయర్‌లో నీటి ఆధారంగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో కొన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాలు నిర్మించారు. వీటి ద్వారా పాలేరులో నీటిని బల్క్‌గా తీసుకుని డబ్ల్యుటీపీ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లో శుద్ధి చేసి పైపులైన్‌ల ద్వారా ఆయా ప్రాంతాల్లో ఓహెచ్ఎస్ఆర్‌లకు అందిస్తారు. అక్కడి నుంచి ఇంట్రా విలేజ్ పైపులైన్‌ల ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సహా పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఏదులాపురం మున్సిపాలిటీ, మధిర నియోజకవర్గంలో చింతకాని, ముదిగొండ మండలాలకు పాలేరు నీటినే అందిస్తారు. పాలేరు జలాశయం పూర్తిగా నింపుతామని, కేవలం తాగునీటికి మాత్రమే వినియోగిస్తామని నీటి పారుదలశాఖ ఖమ్మం ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు 'న్యూస్‌టుడే'తో చెప్పారు. పాలేరు ఎగువన సాగర్ కాలువలో నీటిని ఎవరైనా దారి మళ్లించినా, మోటార్లతో తోడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఒకే విడతలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

దీక్షలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జజ్జూరు మోహన కృష్ణ తదితరులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని విద్యార్థులందరికి ఒకే విడతలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో శనివారం బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన గుప్పిట్లో పెట్టుకొని విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చాక మరో మాట అన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, గతంలో భారాస ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని విమర్శించారు. కార్పొరేటర్ చెరకు భాగ్యలక్ష్మి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జజ్జూరు మోహన కృష్ణ, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాసరెడ్డి, బిక్షపతి, కృష్ణ, దుర్గా శ్రీనివాస్, గాయత్రి, స్వాతి, రాకేష్ కుమార్‌బాబు, భీమల్ కుమార్ జైన్, రఘురాం, కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద రీతిలో నర్సు మృతి

శిరీష

పహాడీషరీఫ్, ములకలపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ నర్సు మృతి చెందిన ఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన వూకి బ్రహ్మయ్య కుమార్తె శిరీష(21) ఏడు నెలల క్రితం మహేశ్వరంలో ఉంటున్న తన పిన్ని కీసర లవకుశ ఇంటికి వచ్చారు. తుక్కుగూడలోని ప్రైమ్‌కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న స్నేహితురాలు కాక సారిక.. శిరీషను అదే ఆసుపత్రిలో నర్సుగా చేర్చారు. ఆసుపత్రికి చెందిన ఓ గదిలో వీరిద్దరూ ఏడు నెలలుగా ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు శిరీష తన గదికి వెళ్లి.. మళ్లీ ఆసుపత్రికి తిరిగిరాలేదు. 2 గంటలకే రావాల్సి ఉన్నా మూడు గంటలవుతున్నా గదిలో నుంచి బయటకు రాలేదు. వైద్యులు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఆమె ఉంటున్న గదికి సిబ్బందిని పంపించారు. గది తలుపునకు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీ సందులోంచి చూడగా శిరీష నేలపై పడి ఉంది. ఆసుపత్రి సిబ్బంది తలుపు విరగ్గొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శిరీష నుదుటిపై ఉన్న దెబ్బలపై ఆరా తీశారు. శిరీష ఒంటిపై గాయాలున్నాయని.. ఆమె మృతిపై అనుమానముందని పిన్ని కీసర లవకుశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆమెపై ఎవరైనా దాడికి పాల్పడ్డారా? అనే విషయంపై ఆసుపత్రితో పాటు బయట ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

PERSONAL CLASSIFIEDS

LOST

నా పేరు వేములపల్లి రంజిత్ కుమార్ S/o శ్రీనివాస్ (లేట్.) ఇంటి నెంబరు 5-3-416 ఖమ్మం నగరం ఖమ్మం జిల్లా. అను నాయొక్క ఒరిజినల్ గిఫ్ట్ డిడ్ డాక్యుమెంట్ 1300/2025. డేట్ 07/02/2025 . ఇంటి దగ్గర నుంచి రైల్వే స్టేషన్ దగ్గర జిరాక్స్ సెంటర్ కు వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. పై డాక్యుమెంట్ ఎవరికైనా లభించిన యెడల ఫోన్: 9985638888

REAL ESTATE

FLAT FOR SALE

ఖమ్మం, శ్రీనగర్ కాలనీ రోడ్ నెం.9లో పూర్తి ఇంటీరియర్‌తో 2,800 Sft లగ్జరీ ఫ్లాట్ అమ్మబడును. సెల్: 9177444973.

ఖమ్మం, మామిళ్ళగూడెం, వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా, తులసి ఆర్చిడ్‌లో 1350 SFT పైగల 2 BHK ఫ్లాట్ నెం: 302 అమ్మబడును. 9052633690.

HOUSE FOR SALE

ఖమ్మం వరంగల్ క్రాస్ రోడ్ ఆదిత్యనగర్-1 ప్రక్కన ఉన్న 2 BHK ఈస్ట్ ఫేసింగ్ అమ్మబడును. 90% లోన్. Cell: 7993841894.

ఖమ్మం జిల్లా బాగ్‌రోడ్ నెం. 4లో సుమారు 175 గజాలలో నెలకు 7500/- అద్దె వచ్చు అన్ని వసతులు ఉన్న ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 9959951469.

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

కల్లూరు మం॥, చెన్నూరు గ్రా॥, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి దగ్గరలో బోరు, పెన్సింగ్‌తో 7 ఎకరాలు అమ్మకం. Cell: 9392122526, 9885603331.

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

ఖమ్మం జిల్లా, సత్తుపల్లి(మం), కొత్తూరు రోడ్డులో గవర్నమెంట్ స్కూల్ దగ్గర, రోడ్డు సైడ్ 5 కుంటల స్థలం అమ్మకానికి కలదు. Ph: 9848482109, 7893333072.

DTCP & RERA Hyd కి సమీపంలో సదాశివపేట ఆరూరు నందు 300 ఎకరాల్లో మెగా వెంచర్‌లో గజం 8999/- మాత్రమే. 9959616622.

ఖమ్మం నగరం, ఖానాపురం హవేలి, కృష్ణుడి గుడి సమీపంలో మంచి నివాస ప్రాంతంలో LRS కలిగి ఉన్న ప్లాట్ అమ్మకానికి కలదు. ఫోన్: 9848572849.

LEASE

ఖమ్మం- కోదాడ హైవేకి నేలకొండపల్లికి ఆనుకొని 1.5 ఎకరాల ల్యాండ్ డెయిరీఫామ్స్, ఫాంహౌస్‌లకు, సామిల్స్‌కు, వ్యవసాయానికి అనువైన ల్యాండ్ పుల్ వాటర్ ఫెసిలిటీ, మంచి వాతావరణం గల ల్యాండ్ లీజుకు ఇవ్వబడును. డైరెక్ట్ ఓనర్, కావాల్సినవారు మాత్రమే వాట్సాప్ కాల్ చేయండి. సంప్ర॥ 9182463300.

JOBS

HR Executive, Floor Incharge/ Floor Supervisor - Female Candidates & Receptionist. ABC Hospital, Near S.P. Stadium, KMM. Cell: 9703362588, 9642646496.

శ్రీశ్రీశ్రీ హీరో షోరూమ్, బైపాస్‌రోడ్, ఖమ్మం నందు పనిచేయుటకు సేల్స్ మేనేజర్ కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ/ బి.టెక్, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ఇంటర్వ్యూ: ది. 31-08-2026 ఉ॥ 10:30 ని॥లకు. సంప్ర॥ 9949911636.

ఖమ్మం 3 టౌన్ ఏరియాలోని ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ M/F, ఫీల్డ్ స్టాఫ్ కావలెను. సెల్: 9000708422, 9866434422.

ఖమ్మం అత్యంత ప్రతిష్టాత్మకమైన వ్యాపార దిగ్గజం G.V. మాల్‌లో పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. ఏజ్ 35-45, అర్హత: 10th పాస్, మంచి జీతం. అన్ని ఆటోమేటిక్ కార్లు డ్రైవ్ చేసే వారికి ప్రాధాన్యత. సెల్: 8639773677

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥25K-30K, భోజనము+వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220

కొత్తగూడెం G.V. మాల్ నందు పనిచేయుటకు క్యాషియర్ వెంటనే కావలెను. సంప్రదించండి: 9281115830.

JOBS
ఖమ్మం సర్జికల్స్‌లో పని చేయుటకు MARKETING PERSONS కావలెను.
• Two Wheeler Must
Qul: 10th above
VISHAL SURGICALS
మామిళ్ళగూడ, ఖమ్మం
Main Branch: నారాయణగూడ, హైదరాబాద్
9866155558

హైదరాబాద్ L.Bనగర్ ఓల్డేజ్ హోమ్ పనిచేయుటకు ANM GNM నర్సింగ్ స్టాఫ్ కావలెను. జీ: 20వేలు ఉచిత వసతి భోజనం. ✆ 9248580427, 9676335813

Hyd,ఆటోనగర్ మెడికల్ ఏజెన్సిలో చేయుటకు Expగల కంప్యూటర్ ఆపరేటర్లు 2&ప్యాకింగ్ హెల్పర్స్, 4వీలర్ డ్రైవర్లు, హౌస్‌కీపింగ్ వర్కర్లు కావలెను.9490044041

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

WANTED
వందేభారత్ DEVELOPER'S
5-Crores Club లో జాయిన్ అవ్వడానికి హైదరాబాద్‌లో ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ మార్కెటింగ్ సిబ్బంధిని ఆహ్వానిస్తుంది
Fortuner Car, Villa, 1 Kg Gold
2 year's Time
✆ 77991 60000

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్ B/W
రూ. 435/- మాత్రమే
(GST అదనం)

WANTED
హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు.
అర్హత - ఇంటర్మీడియట్.
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26, టైమింగ్స్ : ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకుకొని రాగలరు.
సంప్రదించండి :
కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

MARKETING/ SALES

సేల్స్ అసోసియేట్స్ కావలెను. AP/TGలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ, Approved Lay-outs నందు మార్కెటింగ్ చేయుటకు స్త్రీపురుష అభ్యర్థులు కావలెను. కమీషన్, ఇన్సెంటివ్, శాలరీ కలదు. ✆ 91219 75888

SECURITY GUARDS

మరిపెడ బంగ్లా వద్ద పనిచేయుటకు సెక్యూరిటీ ఆఫీసర్, సూపర్‌వైజర్ &గార్డ్స్ కావలెను. ఫ్రీరూం, క్యాంటీన్, ESI,PF కలదు. ✆97044 14427, 9515919991

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008510764
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9652211356

ఆయుధ సామగ్రిని దాచేందుకొచ్చి.. పోలీసులకు చిక్కి

★ డీఏకేఎంఎస్ సభ్యుడి అరెస్ట్

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నక్సల్స్ ఆయుధ సామగ్రిని దాచిపెట్టేందుకు వచ్చిన శనివారం ఆ సంస్థ అనుబంధ డీఏకేఎంఎస్ సభ్యుడు పట్టుబడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో బాసగూడ పోలీసుస్టేషన్ నుంచి డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్) బలగాలు పెగడపల్లి అటవీ ప్రాంతంలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తర్రెం పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్నగెల్లూరుకు చెందిన మావోయిస్టు డీఏకేఎంఎస్ సభ్యుడు బోగం లఖ్ముగా గుర్తించారు. మావోయిస్టుల సామగ్రి, పేలుడు పదార్థాలను దాచిపెట్టేందుకు వచ్చినట్లు అంగీకరించాడు. అతడు చూపించిన ప్రదేశం నుంచి బీజీఎల్ లాంచర్, 18 బీజీఎల్స్ సెల్స్, 12 బాణం బాంబులు, హ్యాండ్ గ్రెనేడ్, రూ.50,050 నగదు ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అడవుల్లో రహస్య స్థావరాల అన్వేషణ కోసం భద్రతా బలగాలు నిరంతర ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి.

బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధ సామగ్రి

హత్యాయత్నం ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి..

★ నిందితుడి ఇంటికి నిప్పు

మౌలానా

బూర్గంపాడు, న్యూస్‌టుడే: మండలంలోని జింకలగూడెంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో గ్రామానికి చెందిన ఇస్మాయిల్ అదే గ్రామానికి చెందిన మౌలానా(42)ను ఈ నెల 23న కారుతో ఢీకొట్టి చంపడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో మౌలానా తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతి సమాచారం తెలుసుకున్న మృతుడి బంధువులు, స్నేహితులు మౌలానా మృతదేహాన్ని నిందితుడి ఇంటికి తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకోగా వాగ్వాదం చోటు చేసుకుంది. నిందితుడిని శిక్షించాలని మృతుడి కుటుంబీకులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. నిందితుడు ఇస్మాయిల్ ఇంటితోపాటు అతని సమీప బంధువు ఇంటిపై దాడి చేసి సామగ్రిని ధ్వంసం చేశారు. ఇస్మాయిల్ ఇంటికి నిప్పు పెట్టారు. పోలీసులు, స్థానికులు మంటలను ఆర్పివేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది గ్రామంలో మోహరించారు. నిందితుడు ఇస్మాయిల్‌పై పశువుల అక్రమ రవాణా అంశంలో జిల్లాలో పలు ఠాణాల్లో కేసులు ఉన్నట్లు ఎస్సై మేడ ప్రసాద్ తెలిపారు. అతనిపై రౌడీషీట్ ఉన్నట్లు తెలిసింది.

ఆయిల్‌పాం నర్సరీల్లో పీఈక్యూ బృందం తనిఖీలు

నర్సరీలో తనిఖీ బృందం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం నర్సరీల్లో పీఈక్యూ (పోస్ట్ ఎంట్రీ క్వారంటైన్) బృందం ద్వితీయ దశ తనిఖీలు నిర్వహించింది. అశ్వారావుపేట, అప్పారావుపేట ఆయిల్‌పాం నర్సరీలను శనివారం బృందం సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. అప్పారావుపేటలో 75 వేలు, అశ్వారావుపేటలో 2.25 లక్షల మొక్కలకు పరిశీలన జరిపారు. మచ్చలు, తెగుళ్లు, కలుపు ఉన్నాయా అని చూశారు. ఏక వరుస విధానం, వరుసల మధ్య, మొక్కల మధ్య తగిన దూరం పాటించడం సంతృప్తిగా ఉన్నట్లు బృందం తెలిపింది. మూడో దశ తనిఖీలు పూర్తైన వెంటనే రైతులకు మొక్కలు సరఫరా చేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ డీఓ శంకర్ తెలిపారు. ఎల్‌నినో నేపథ్యంలో ముందుగానే బిందు సేద్యం పరికరాలు అమర్చుకోవాలని సూచించారు. బృందంలో ప్లాంట్ పాథాలజీ విభాగం అధిపతి డా బి.పుష్పావతి, ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు రామ్‌కుమార్, వెంకటరెడ్డి ఉన్నారు.

బిహార్ వాసి హత్యకేసులో నిందితుల అరెస్టు

నిందితుల అరెస్టు చూపుతున్న వైరా ఏసీపీ, మధిర సీఐ, ఎస్సై

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిరలో జరిగిన బిహార్ వాసి హత్య కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. ఈనెల 11న మధిర-వైరా ప్రధాన రహదారి పక్కన పీవీఆర్ అండ్ ఎస్ ఫంక్షన్ హాలు సమీపంలోని బ్రిక్స్ కంపెనీ వద్ద బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా సదాత్‌పూర్ పైగంబర్‌పూర్ కొల్హువా ప్రాంతానికి చెందిన ఎండీ తాలీమ్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులైన బ్రిక్స్ కంపెనీలో పనిచేస్తున్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొమెర గ్రామానికి చెందిన గద్దల జమలయ్య, ఎర్రుపాలెం మండలం గుంటుపల్లి గోపారం గ్రామానికి చెందిన గంజి రాములమ్మ దంపతులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

☆ వైరా ఏసీపీ సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ఎండీ తాలీమ్ మద్యం మత్తులో మధిరలోని బ్రిక్స్ కంపెనీ వద్దకు వచ్చి రాములమ్మతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె భర్త జమలయ్య కర్రతో కొట్టడంతో తలపై తీవ్ర గాయమై తాలీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారు తాము పనిచేస్తున్న బ్రిక్స్ కంపెనీ యజమాని కాసర్ల వెంకటేశ్వరరావుకు, అతని బంధువు పేరయ్యకు హత్య విషయం చెప్పారు. కొట్టి చంపిన కర్రను దాచి ఎటైనా పారిపొమ్మని వారు సలహా ఇచ్చారు. ఈ కేసును పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. వారిని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దంపతులపై హత్యా నేరం నమోదు చేయడంతోపాటు, సాక్ష్యాధారాలను తారుమారు చేయాలని సూచించినందుకు వెంకటేశ్వరరావు, పేరయ్యలనూ నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం వారిద్దరూ పరారీలో ఉన్నారు. నిందితులు వినియోగించిన కర్రను, మృతుడి సెల్‌ఫోన్, దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ రమేష్, ఎస్సై నవిత, సిబ్బందిని వైరా ఏసీపీ సారంగపాణి అభినందించారు.

(c) eenadu

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

పర్యవేక్షణ కొరవడి.. క్రమశిక్షణ లోపించి

ఎస్సీ బాలుర వసతిగృహం పరిస్థితి ఇది

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

ఏళ్లు గడుస్తున్నా, అధికారులు ఎంతమంది మారుతున్నా మణుగూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం తీరు మాత్రం మారడం లేదు. అక్కడి సమస్యలు అధికారులకు పట్టడంలేదు. శుక్రవారం రాత్రి కరెంటు సరఫరా లేకపోవడంతో పలువురు విద్యార్థులు చీకట్లోనే నిద్రించారు. ఈ విషయంపై కొంత మంది స్థానిక వ్యక్తులు విద్యుత్తు అధికారులకు సమాచారం ఇవ్వగా వాళ్లు వచ్చి పరిశీలించడంతో మీటరు నుంచి వైర్లు తొలగించి ఉన్నాయి. ఇలా ఎవరు చేశారని విద్యార్థులను ప్రశ్నిస్తే బయటి వ్యక్తులు వచ్చి వైర్లు తొలగించారని సమాధానమిచ్చారు. వార్డెన్ల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఈ ఘటనలు జరుగుతున్నాయి.

శుక్రవారం రాత్రి వసతిగృహంలో నిలిచిన విద్యుత్తు సరఫరాను పరిశీలిస్తోన్న సిబ్బంది

వార్డెన్‌ల ఇష్టానుసారం..

పాఠశాల, కళాశాల పిల్లల పర్యవేక్షణకు ఇద్దరు వార్డెన్లు ఉన్నారు. కళాశాల విద్యార్థుల వార్డెన్ ఇష్టానుసారం రావడం, వచ్చినా వెంటనే వెళ్లిపోవడం, ఆఫీసు గది, స్టోర్‌రూం తాళాలు విద్యార్థులకే ఇవ్వడం, చిన్నపిల్లలను బెదిరించడం వంటివి చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఇక నూతనంగా వచ్చిన చిన్నపిల్లల వార్డెన్ సమయానికి రాకపోవడం, హాజరుపడిన వెంటనే వెళ్లిపోవడం, చిన్నపిల్లల సంరక్షణను పట్టించుకోకపోవడం లాంటివి చేస్తున్నట్లు సమాచారం. వార్డెన్ల నిర్లక్ష్యం కారణంగా చాలామంది విద్యార్థులు రోజూ కళాశాలకు వెళ్లకుండా వసతిగృహంలోనే ఉండటం, అర్ధరాత్రి వరకూ ద్విచక్ర వాహనాలపై బయటి వ్యక్తులతో తిరగడం, రాత్రుళ్లు డీజే సౌండ్లతో నృత్యాలు చేయడం, సిగరెట్లు, మందు తాగడం వంటివి చేస్తున్నారు.

నామమాత్రంగా అధికారుల తనిఖీలు..

ఉన్నతాధికారులు మాత్రం తనిఖీలకు వచ్చినప్పుడు నామమాత్రంగా పిల్లలు, వార్డెన్లతో మాట్లాడటం చేస్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కార మార్గం చూపడంలేదు. ఇక్కడ పది రోజులకో వివాదం జరగడం ఆనవాయితీగా వస్తోంది. పాత వార్డెన్లను బదిలీ చేస్తే, నూతనంగా వచ్చిన వారు సైతం అలాగే ఉంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉండాలి – హనుమంతరావు, ఏఎస్‌డబ్ల్యూవో

ఎస్సీ బాలుర వసతిగృహంలో ఇద్దరు వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. ఇద్దరి మధ్య విభేదాలతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు. కళాశాల విద్యార్థులను మరో చోటకు తరలించేందుకు అనువైన భవనం కోసం చూస్తున్నాం.

వేతన బకాయిలు విడుదల చేయాలి

గుండాల: ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి నాలుగు నెలల బకాయి వేతనాలు అందజేయాలని సంఘం నాయకులు సాంబయ్య అన్నారు. శనివారం గుండాలలో ఆయన మాట్లాడారు. తమపోస్టు మినహా మిగతా వారందరికీ వేతనాలు సకాలంలో అందుతున్నాయన్నారు. ఏపీవో రవితేజకు పలు మార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇతరులు తీసుకొని ఎస్సీలుగా చలామణి అవుతున్నారు. ఇలాంటి వాటిపై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. **- దాసరి శేఖర్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం.**

సమాధానం: పూర్తి విచారణ తర్వాతే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తాం. **- కోట రవికుమార్, తహసీల్దారు, భద్రాచలం**

– భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

పాత నారంవారిగూడెం ప్రధానవీధిలో సత్తెనపల్లి శేషయ్య ఇంటి ఎదుట తారు రోడ్డుపై మురుగు పారుతోంది. ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. సమస్యను పరిష్కరించగలరు. **- టి.వెంకటేశ్వరరావు**

✔ సిబ్బందిని పంపి మురుగు రహదారిపైకి రాకుండా ఏర్పాట్లు చేయిస్తాను. **- మనుగొండ నాగమణి, సర్పంచి**

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

కళ తప్పిన చెరువులు.. ఆందోళనలో రైతులు

చర్ల, న్యూస్‌టుడే

గ్రామాల సుభిక్షానికి ఆయువుపట్టు చెరువులే. ఎల్‌నినో ప్రభావంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. చెరువులు నిండక భూగర్భ జలాలు అడుగంటి రానున్న కాలంలో దుర్భిక్ష పరిస్థితులు దాపురించే ఆందోళనకర ఛాయలు పల్లెల్లో కనిపిస్తున్నాయి. చెరువుల్లో ఉన్న నీళ్లు కాస్తా ఇంకిపోతే పశుపక్ష్యాదుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. తాగునీటిపైనా ఈ ప్రభావం పడనుంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల పరిధిలోకి వచ్చే భద్రాచలం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని తటాకాలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. ఈ సర్కిల్ పరిధిలో 1,330 చెరువులకు గానూ కేవలం 305 చెరువులు మాత్రమే శనివారం నాటికి 75 నుంచి వంద శాతం నిండాయి. మిగిలిన చెరువుల్లో ఆ కాసింత జలాలు చేరలేదు. ఫలితంగా చెరువుల కింద సాగు చేసిన పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధికారులు ముందు నుంచి ఆరుతడి పంటలు వేయాలని చెబుతున్నా.. రైతులు మాత్రం వరి వైపే మొగ్గు చూపారు. అడపాదడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలు ఆశలు రేకెత్తించినా ప్రస్తుతం నీరుగారే పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. చిన్నపాటి చెరువుల్లో సైతం నీరు చేరలేదు. ఈ సర్కిల్ పరిధిలోని ఆయా చెరువుల కింద 70,456 ఎకరాల ఆయకట్టు ఉంది. 10.957 టీఎంసీల నీళ్లు ఉండాల్సి ఉండగా అందులో పావు వంతు నీళ్లు కూడా ఇప్పటికీ చేరలేదు. మరో నెల గడిస్తే వానాకాలం దాదాపు ముగిసినట్లే. రానున్న ఈ కొద్ది రోజుల్లో వానదేవుడు కరుణిస్తేనే పంటలు పండేది. లేకుంటే కరవు పరిస్థితులు ఎదుర్కోక తప్పని పరిస్థితి.

మత్తడి దగ్గరకు నీళ్లు చేరుకోని ఎర్రబోరు చెరువు

నెర్రెబారుతున్న పొలాలు..

వర్షాలు లేక చెరువుల కింద పొలాలు నెర్రెలు బారుతున్నాయి. వాగులు, వంకల ద్వారా వచ్చే ప్రవాహాలు ఈ ఏడాది గణనీయంగా తగ్గాయి. తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు లాంటి జల వనరులకు అనుసంధానంగా ఉన్న చెరువులకు మాత్రం కాసింత నీళ్లు చేరి ఆయకట్టు రైతుల్లో ఆశలు రేపాయి. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గితే వీటి కింద కూడా నిరాశ తప్పదు.

ఆకాశవాయి అంతే సంగతులు..

భద్రాచలం డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఆకాశవాయి పంటల (వానమీదే ఆధార పడిన) పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రెండు మండలాల్లో దాదాపు 30వేల ఎకరాల భూముల్లో వానలు పడతాయనే ఆశతో కరేదా వరిని రైతులు సాగు చేశారు. వానలు ముఖం చాటేయడంతో ఇప్పుడు నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

ఏకరూప దుస్తులు అందజేయాలి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియాలోని సింగరేణి ప్రైవేటు భద్రతా సిబ్బందికి ఏకరూప దుస్తులు అందజేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్వోటూ జీఎం వెంకటరామారావుకి శనివారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు నాజర్‌పాషా మాట్లాడుతూ.. భద్రతా సిబ్బంది మ్యాన్‌పవర్ సప్లై టెండర్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా దుస్తులు, ఇతర సామగ్రి ఇవ్వలేదన్నారు. మంగీలాల్, రవి, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ ఒత్తిడితో డిమాండ్ల అంగీకారం'

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ ఒత్తిడితోనే యాజమాన్యం లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మికుల న్యాయమైన డిమాండ్లపై అంగీకారం కుదిరిందని సంఘం బ్రాంచి కార్యదర్శి రాంగోల్ తెలిపారు. పీకేఓసీ 2 గనిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఏళ్లుగా కార్మికులు ఎదురు చూస్తున్న పెర్క్‌పై ఆదాయపు పన్నుని చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈశ్వరరావు, సురేంద్రరావు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

మణుగూరు పట్టణం: అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు బాల్య మిత్రులు. కోటకట్ట ప్రాంతానికి చెందిన దంసలపూడి నాగభూషణం శనివారం మృతి చెందాడు. అతని కుటుంబ పరిస్థితి బాగోలేకపోవటంతో రూ. 50 వేల నగదుని ఆర్థిక సాయంగా అందజేశారు. రామకృష్ణ, రవి, నానాజీ, శంకర్ పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు ఎస్కే ఉమర్ పిలుపునిచ్చారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని గ్రామాల్లో శనివారం సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శంకర్, బాలు, రమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

అశ్వాపురం, న్యూస్‌టుడే: తమకు రక్షణ కల్పించాలని కోరుతూ మంచికంటినగర్‌కు చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్‌కు ఈ నెల 27న ఫిర్యాదు చేశారు. జగ్గారానికి చెందిన కొందరు తమపై దాడి, హత్యాయత్నం, బెదిరింపులు, తమను ఇంటి నుంచి బలవంతంగా వెళ్లగొట్టడం, ఇంటిని అక్రమంగా స్వాధీనం చేసుకోవడం వంటి ప్రయత్నాలకు పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్రావెల్ అక్రమ తోలకాలపై చర్యలు చేపట్టాలి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: గుట్టమల్లారం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం గిరిజన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి కేటాయించిన భూమిలో జరుపుతున్న అక్రమ గ్రావెల్ తోలకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారాస ఆధ్వర్యంలో డీటీ రామారావుకి శనివారం వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు, పోశం నర్సింహారావు, ముత్యంబాబు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మణుగూరు సాంస్కృతికం: సెప్టెంబర్ 6, 7, 8వ తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. మణుగూరులో శనివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. లక్ష్మీకుమారి, లక్ష్మినారాయణ, సీతారాములు, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం నిర్వహించారు. అర్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. మేనేజరు పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభినందన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే

అశ్వాపురం: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పూనెం వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ నేపథ్యంలో అశ్వాపురం ప్రధాన కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం అభినందన సభ జరిగింది. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

డప్పు కళాకారుడికి ఆర్థిక సాయం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న అశ్వారావుపేటకు చెందిన డప్పు కళాకారుడు ఎం.మల్లేశ్‌కు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, సూర్యారావు ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000 అందించారు.

రైస్ మిల్లును సందర్శించిన ఉన్నతాధికారులు

అశ్వాపురం: జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా మేనేజర్ ఎస్.త్రినాథ్‌బాబు శనివారం అశ్వాపురం ప్రధాన కేంద్రంలోని ఓ రైస్ మిల్లును సందర్శించారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యానికి, ధాన్యానికి మధ్య వ్యత్యాసం పరిశీలన చేయడానికి వచ్చినట్లు సమాచారం. జిల్లా మేనేజర్‌ను సంప్రదించగా.. సాధారణ సందర్శనలో భాగంగానే వచ్చామని చెప్పారు.

బొగ్గు గని కార్మికులకు మధ్యంతర భృతి చెల్లించాలి

మణుగూరు పట్టణం: కోల్ ఇండియా యాజమాన్యం 12వ వేతన ఒప్పందం జరిగేంత వరకు ముందుగా బొగ్గు గని కార్మికులకు 25శాతం ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని హెచ్‌ఎంఎస్ బ్రాంచి ఉపాధ్యక్షురాలు శ్రీలత తెలిపారు. సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రం 12వ వేతన ఒప్పందం జరగకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

'ఎమ్మెల్యే పీఏను కఠినంగా శిక్షించాలి'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కల్యాణ్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రంగారెడ్డి శనివారం డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగాల ఆశ చూపి రూ.కోట్లల్లో దండుకున్నాడన్నారు. కల్పన, సాయి శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను మోసగిస్తున్న ఏఐటీయూసీ'

మణుగూరు పట్టణం: ఇచ్చిన హామీలు మరిచి నెరవేరని హామీలు నెరవేరినట్లు ఏఐటీయూసీ చేస్తున్న ప్రచారాన్ని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా ఖండిస్తుందని బ్రాంచి ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు తెలిపారు. పీవీకాలనీలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలు మాట్లాడి కార్మిక వర్గంలో విలువలతో కూడిన ఉపన్యాసాలు ఇస్తే మంచిదన్నారు. గట్టయ్య, అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు..

పింఛన్ దరఖాస్తులకు ఆహ్వానం

కరకగూడెం: మండలంలోని ప్రతి పంచాయతీలో ఆసరా పెన్షన్‌కు అర్హులైన వితంతు, ఒంటరి మహిళలకు దరఖాస్తులు స్వీకరించాలని సామాజిక భద్రత జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నర్మదారెడ్డి ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆసరా పెన్షన్‌లపై ఆరా తీశారు. నూతనంగా 200 దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఏపీఎం వినోద్ క్రాంతి పాల్గొన్నారు.

సభ్యత్వాలకు ఆగస్టు 31 తుది గడువు

భద్రాచలం పట్టణం: వ్యాపారుల సభ్యత్వాలకు ఆగస్టు 31 తుది గడువు అని అనంతరం నూతన సభ్యత్వాలను స్వీకరించబోమని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు అన్నారు. శనివారం వారు మాట్లాడారు. నమోదు అనంతరం ఎన్నికల తేదీ ప్రకటించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు రాంబాబు, బాబ్జీ, రమణారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సర్' కార్యక్రమంపై విచారణ

దుమ్ముగూడెం: మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సర్‌పై తహసీల్దార్ ఎం.అశోక్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రామ్ శనివారం విచారణ నిర్వహించారు. మ్యాపింగ్ కాని, తప్పులు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసిన విషయంపై విచారణ చేశారు. భరణిబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా సమస్యలపై ఎంఈఓకు వినతి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: విద్యా సమస్యలపై భద్రాచలం ఎంఈఓ శ్రీనివాసరావుకు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, శ్రీనివాస్, ఆశాలత తదితరులు ఉన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచి రమాదేవి శనివారం ప్రారంభించారు. గొర్రెలు, మేకలకు పశువైద్యాధికారిణి తేజరాణి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు

అంతర పంటగా వరికే ప్రాధాన్యం

ఎల్‌నినో నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధానంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా ఆయిల్‌పాం పంటలే కనిపిస్తున్నాయి. మంత్రి స్వగ్రామం గండుగులపల్లిలో ఆయన చొరవతో మాగాణి అంతా ఆయిల్‌పాంమయంగా మారుతోంది. ఆ గ్రామంలో ఓ రైతు ఆయిల్‌పాం మొక్కలు నాటినా వరిపై మక్కువ చంపుకోలేక అంతర పంటగా తిరిగి వరినే సాగు చేశాడు. ఈ దృశ్యాన్ని న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది. – దమ్మపేట, న్యూస్‌టుడే

మురుగు నీటితో అవస్థలు

మారుమూల గిరిజన గ్రామం కొండతోగు ప్రాథమిక పాఠశాల సమీపంలో ఇళ్లలో వినియోగించిన వ్యర్థపు నీరు చేరి నిలువ ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో 15 మంది చదువుకుంటున్నారు. గ్రామంలోని మురుగునీరు పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన నల్లా, నీటి తొట్టి వద్ద చేరి నిల్వ ఉండటంతో బురద ఏర్పడి అపరిశుభ్రత చోటు చేసుకుంది. సర్పంచి వెంకటమ్మ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు

అశ్వారావుపేట పట్టణం సంతపాకల సమీపంలో ఉన్న జలభాండాగారం సమీపంలో నాయీబ్రాహ్మణ బజారు నుంచి మురుగునీరు, జలభాండాగారం నుంచి వచ్చే వృథా నీరు కలిసే ప్రదేశం మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. దీంతో దుర్వాసన వస్తోంది. బుధవారం రోజు ఆ పక్కనే చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తుంటారు. కొనుగోలుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీటి గుంతను శుభ్రం చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ శశికళను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వ్యర్థాలను తొలగిస్తామని తెలిపారు. – అశ్వారావుపేట, న్యూస్‌టుడే

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలి

దమ్మపేట: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఈషా 18వ గ్రామోత్సవంలో భాగంగా గ్రామీణ క్రీడాప్రోత్సాహక వేదిక ఆధ్వర్యంలో జరిగిన రూరల్ ప్రీమియమ్ లీగ్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైన ఆసుపాక క్రీడాకారులను గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం సత్కరించారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అయన అన్నారు. ★ గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రతి రోజు ప్రజాపాలనలో ఎమ్మెల్యే పాల్గొని వినతులు స్వీకరించారు. ★ అంకంపాలెం సీయోను ప్రార్థనామందిరంలో జరిగిన పాస్టర్ ఫెలోషిప్ సమావేశంలో పాస్టర్లకు నూతన వస్త్రాలు, శిరస్త్రాణాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జారె

పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల అవస్థలు

పినపాక, న్యూస్‌టుడే

మండల పరిధిలోని బీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యంతో పాటు పంటలు నాశనమవుతున్నాయి. సహజసిద్ధంగా పారే కాలువలు సైతం బూడిదమయంగా మారాయి. సమస్యను ప్రభావిత ప్రాంతాల ప్రజలు బీటీపీఎస్ అధికారులకు విన్నవించినా స్పందన కరవైంది. గ్రామానికి చెందిన యువత కాలుష్యం సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతిపత్రం అందించారు. స్పందించిన సదరు అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని బీటీపీఎస్ అధికారులను ఆదేశించారు. 2 నెలల గడువు కోరిన ప్లాంటు అధికారులు ఆరునెలలు కావస్తున్నా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కాలుష్య నియంత్రణలో భాగంగా అవసరమైన మేర మొక్కలు నాటడంతో పాటు ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీటీపీఎస్ నుంచి వెలువడుతున్న పొగ

తెలుగును కాపాడుకోవడం మన బాధ్యత

ప్రధానాచార్యుడు చిన్నప్పయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హవీలా శనివారం అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం మండల పరిషత్తు పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణుగూరు సాంస్కృతికం: మణుగూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యుడు చిన్నప్పయ్య మాట్లాడారు. ఖండాంతరాలు దాటినా మాతృభాషను మరువద్దన్నారు. ఆయనను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. భాస్కర్‌రావు, నాగిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆళ్లపల్లి: ఆళ్లపల్లి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు తెలుగుభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంఈఓ శాంతారావు అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'క్రీడలతో క్రమశిక్షణ సాధ్యం'

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: హాకీ దిగ్గజం.. మేజర్ ధ్యాన్‌చంద్ భారత క్రీడా రంగానికి చిరస్మరణీయ సేవలందించారని వ్యవసాయ కళాశాల ఏడీ డా. హేమంత్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి విద్యార్థులు, ఆచార్యులు నివాళులర్పించారు. క్రీడలతో చక్కటి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మణుగూరు సాంస్కృతికం: రామానుజవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం యశోద, పీడీ అనిల్ పాల్గొన్నారు.

చర్ల: చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం హరిప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాస్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాలన్నారు. పీడీ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు జాన్‌మణి నేతృత్వంలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రీడల ఔన్నత్యాన్ని చాటేలా విద్యార్థుల ప్రదర్శన

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: మెచ్చా

దమ్మపేట, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భారాస నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌ఛార్జి వెంకటరమణ ధ్వజమెత్తారు. దమ్మపేటలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు నడుస్తున్నాయని, మంత్రి కొండా సురేఖ కూతురి వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు కేటీఆర్ సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఐదు మండలాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెచ్చా నాగేశ్వరరావు

హరికృష్ణకు నివాళులు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నందమూరి హరికృష్ణ వర్ధంతిని లక్ష్మీనగరంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ శ్రేణులు నివాళులర్పించాయి. మండలాధ్యక్షుడు దామోదర్‌రావు, వేణుగోపాల్, ప్రసాద్, వీర్రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

దమ్మపేట, న్యూస్‌టుడే: జీసీసీ హమాలీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్ డిమాండ్ చేశారు. గిరిజన సహకార సంఘ భవనం ఎదుట హమాలీలతో కలిసి శనివారం ధర్నా చేశారు. క్వింటా ఎగుమతి, దిగుమతి ధరలను రూ.29 నుంచి రూ.40కి పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట: అశ్వారావుపేట లక్ష్మీగణపతి ఆలయ కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా కర్పూరపు సత్యనారాయణ, అప్పారావు, మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గణపతి ఉత్సవాలను నూతన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికైన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టేది?

జూద స్థావరంపై దాడి రూ.1.22 లక్షలు పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

అశ్వారావుపేట మండలంలో ఈ మధ్య ఇసుక దందా, జూదం, కోడిపందాలు, గంజాయి విక్రయాలు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు పెరుగుతున్నాయి. తాజాగా వేదాంతపురం శివారులోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు శనివారం దాడి చేసి పెద్దమొత్తంలో నగదు, 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. రూ.1,22,310, రెండు కార్లు, 16 బైక్‌లు, 16 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరికొందరు పారిపోయినట్లు, పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బడాబాబులు సైతం..

నాలుగు నెలలుగా ఈ ప్రాంతంలో అశ్వారావుపేట పట్టణం వడ్డెరబజారుకు చెందిన ఓ వ్యక్తితోపాటు, సత్తుపల్లికి చెందిన కొందరు జూద స్థావరం నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన బడాబాబులు ఉన్నారు. పోలీసుల దాడి సమయంలో సుమారు 40 మంది వరకు ఉన్నట్లు సమాచారం. సత్తుపల్లి మున్సిపాలిటీలోని ఓ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ పట్టుబడటంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరికొందరు బడాబాబులను తప్పించారనే ఆరోపణలున్నాయి.

నిఘా వైఫల్యమా.. ఉదాసీనతా?

పోలీస్ సర్కిల్ కేంద్రమైన ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు వెలుగుచూస్తుండటంతో.. పోలీసుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. వేదాంతపురంలో జూద స్థావరంపై కొత్తగూడెం టాస్క్‌ఫోర్సు పోలీసులు వచ్చి దాడి చేసే వరకు స్థానిక పోలీసులకు అక్కడ జూదం నిర్వహిస్తున్న విషయం తెలియకపోవడం గమనార్హం.

ఉక్కుపాదం మోపుతాం

చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చాలా మందిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి అరెస్టు చేశాం. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతాం.– నాగరాజురెడ్డి, సీఐ అశ్వారావుపేట

బాలిక ఆత్మహత్యాయత్నం

మణుగూరు పట్టణం: మణుగూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె వెంట ఓ వ్యక్తి 4 నెలలుగా ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పగా అతడిని నమ్మింది. తర్వాత అతను పెళ్లికి నిరాకరించటంతో మనస్తాపానికి గురై ఈ నెల 21న పురుగు మందు తాగింది. మణుగూరు ఆసుపత్రిలో చికిత్స అందించగా మెరుగైన వైద్యం కోసం బాలికను శుక్రవారం కొత్తగూడెం తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

M.S.R. INSTITUTE OF PHYSICAL EDUCATION

(Recognised by NCTE & Affiliated to M.G. University., Nallagonda, T.G.)
Durajpally, Chivemla(M), Suryapet (Dt)-508213
Ph: 9848224597, E-mail: msrcollegebed@gmail.com
U.G.D.P.Ed. ADMISSIONS 2026-2028

Applications are invited for the 25% B Category U.G.D.P.Ed. Management seats from the eligible Candidates. The total Vacancies are 13. The applications should reach the office on or before **01/09/2026.** Application is available in our **website:msrdpedcollege.org** or contact the Office.

(c) eenadu

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆరోపించారు. స్థానిక జేకే కాలనీలోని భారాస కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో శనివారం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరీ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. నాయకులు సత్యనారాయణ, లక్కినేని సురేందర్, దళ్‌సింగ్ నాయక్, కౌన్సిలర్ సారయ్య, దేవిలాల్‌నాయక్, వెంకటేశ్వరరావు, రాజేశ్, హరికృష్ణ పాల్గొన్నారు.

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభను జయప్రదం చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు సాబీర్‌పాషా కోరారు. ఈ మేరకు రూపొందించిన ప్రచార గోడపత్రాలను ఆయన తోటి నాయకులతో కలిసి శేషగిరిభవన్‌లో శనివారం ఆవిష్కరించారు. కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, నగేష్, భూక్యా శ్రీనివాస్, వీరాస్వామి, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: రెడ్డిగూడెంలోని అటవీ ప్రాంతంలో అటవీభూమిలో చెట్లు నరికి సాగు చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. - **స్థానికులు.** సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు చేపడతాం. - **కవితామాధురి, యానంబైలు రేంజర్**

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

క్రీడలకు సమయం కేటాయించండి: కూనంనేని

పరుగులో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని, డీఎస్పీ పరంధామరెడ్డి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: దేహదారుఢ్యాన్ని పెంపొందించుకొని, క్రీడలను ఆదరించేందుకు రోజూ కొంత సమయాన్ని విధిగా కేటాయించుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని యువజన, క్రీడల విభాగం ఆధ్వర్యంలో శనివారం 2కే రన్ ఏర్పాటైంది. రన్‌ను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడాకారులను దృష్టిలో ఉంచుకొని 18 ఎకరాల్లో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన పరుగు ప్రకాశం మైదానం దాకా కొనసాగింది. డీఎస్పీ పరంధామరెడ్డి, మేయర్ గణేశ్, క్రీడ సంఘాల నిర్వాహకులు మహేందర్, కాశీరాం సేన్, రమేశ్, రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, సాయిని రంజిత్, కృష్ణ, కల్యాణ్, సత్యనారాయణ, నవీన్, డేనియల్, శ్రీధర్, ఇమాం, మల్లికార్జున్, నాగేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై విద్యార్థులకు అవగాహన

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కూలీలైన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ ప్యానెల్ అడ్వకేట్లు గాజుల రామ్మూర్తి, షాజహాన్ పర్వీన్‌లు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం, బాల్య వివాహాలతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. శారీరక, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. వాటికి దూరంగా ఉండటానికి విద్యార్థులు చైతన్యవంతులుగా మారాలన్నారు. న్యాయవాదులు పి. నాగేశ్వరరావు, పారాలీగల్ వాలంటీర్ షాజహాన్ బేగం, ప్రధానోపాధ్యాయులు లాలు, ఉపాధ్యాయులు దేవిలాల్ పాల్గొన్నారు.

అధికారులు పట్టుకున్నా.. ఆగని విద్యుత్తు చౌర్యం

న్యూస్‌టుడే, పాల్వంచ గ్రామీణం

అక్రమ విద్యుత్తు వాడకాన్ని గుర్తించిన అధికారులు దాడులు చేసి ఏపీటీఎస్ ఖమ్మంలో కేసు నమోదు చేశారు. రూ. లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. అయినా ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్‌కే అక్రమంగా తీగలు వేసుకొని మళ్లీ యథేచ్ఛగా అక్రమ విద్యుత్తు వినియోగిస్తున్నారు. ఇలాంటివి మరెన్నో ఉన్నా.. విద్యుత్తు శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

★ పాల్వంచ మండలం జగన్నాథపురంలోని ఓ కోళ్లఫారంలో ఏడాది నుంచి విద్యుత్తు చౌర్యం జరుగుతోంది. ఆ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఏకంగా అక్రమ విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసి కోళ్లఫారంను వాడుతున్నారు. స్థానికుల ఫిర్యాదుతో విద్యుత్తు విజిలెన్స్ ఏడీ రాంరెడ్డి తనిఖీ చేసి పట్టుకున్నారు. నాలుగు షెడ్లకు అక్రమ విద్యుత్తు 8వేల యూనిట్లు వాడుతున్నట్లు గుర్తించి రూ. లక్ష అపరాధరుసుం విధించారు. అయినా అదే తరహాలో అక్రమంగా విద్యుత్తు వాడుతున్నారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం బిల్లుల్లో తేడా రాకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. రెండు మీటర్లు ఉండగా ఒక మీటర్‌ను నార్మల్‌గానే నడిపిస్తూ, మరో మీటర్‌కు అక్రమ విద్యుత్తు వైర్లు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రిళ్లు ట్రాన్స్‌ఫార్మర్స్‌కు విద్యుత్తు తీగలు తగిలిస్తున్నట్లు సమాచారం.

నియంత్రికకు వేసిన అక్రమ విద్యుత్తు తీగలు

★ పాల్వంచ పట్టణంలోని ఓ దుస్తుల దుకాణ నిర్వాహకుడు సర్వీస్ వైరునకు అదనపు తీగ అమర్చి విద్యుత్తు చౌర్యం చేస్తున్నాడు. కింది స్థాయి సిబ్బంది సహకరిస్తుండటంతో అతను పట్టుబడటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

స్థానిక అధికారులు ఏం చేస్తున్నట్లు..?

అక్రమ విద్యుత్తు వాడకం స్థానిక అధికారులకు తెలియకుండా ఉంటుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈ నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంది. కానీ వీరు ఎవరూ పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. కమర్షియల్ విద్యుత్తు బిల్లు లైన్‌మన్, ఇన్‌స్పెక్టర్ తీయాల్సి ఉంది. పెద్దపెద్ద షెడ్లు నాలుగు, పదుల సంఖ్యలో హీటింగ్ ఫ్యాన్లు, పంకల్లో వాడే పెద్దపెద్ద ఫ్యాన్లు 6, పదుల సంఖ్యలో బల్బులు వినియోగిస్తున్నారు. వీటన్నింటికీ ప్రతి నెల విద్యుత్తు బిల్లు కనీసం రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు వస్తుంది. ఆయన ప్రతినెల సాధారణంగా బిల్లు వస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై విజిలెన్స్ ఏడీ రాంరెడ్డి మాట్లాడుతూ.. మళ్లీ విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి, అపరాధ రుసుం ఆరింతలు వసూలు చేస్తామన్నారు.

ప్రతి పంచాయతీలో ఫారంపాండ్ పనులు తప్పనిసరి

రోళ్లపాడులో మస్టర్లను తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

టేకులపల్లి, న్యూస్‌టుడే: ప్రతి పంచాయతీలో కనీసం ఐదు నుంచి ఆరు ఫారంపాండ్ పనులు జరిగే విధంగా పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు చొరవ తీసుకోవాలని డీఆర్‌డీవో విద్యాచందన సూచించారు. మండలంలోని రోళ్లపాడు, లచ్చగూడెంలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను శనివారం ఆమె తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు రోజు 80 మంది తగ్గకుండా హాజరయ్యే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి, రోళ్లపాడు, లచ్చగూడెం సర్పంచులు ఎదల్ల వెంకటేశ్వర్లు, కొడెం రామమ్మ, కార్యదర్శులు రాజు, సునీత, ఏపీఓ శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టేకులపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన సంఘటన మండల పరిధిలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తుమ్మలచెలక గ్రామానికి చెందిన చీమల మురళి, పాయం రాధా ఆటోలో తుమ్మలచెలక వెళ్తున్నారు. దాసుతండా సమీపంలోని రైస్‌మిల్లు వద్దకు రాగానే అకస్మాత్తుగా రోడ్డు మీదకు కోతి రావడంతో తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో మురళి, రాధాకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కొత్తగూడెం తరలించారు.

వాహనదారులు జర పైలం..

జి.కొత్తతండా పంచాయతీ పరిధిలోని మంగ్యాతండా నుంచి జి. కొత్తతండా మార్గంలో మూలమలుపు సమీపంలో బీటీ రోడ్డు కోతకు గురైంది. ఏమరుపాటుగా ఉంటే ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రక్కులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. పంచాయతీ సిబ్బంది కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, మార్జిన్‌లకు మొరం తోలకం చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి చైతన్య పేర్కొన్నారు.

– టేకులపల్లి, న్యూస్‌టుడే

వృథాగా పోతున్న తాగునీరు..!

పాల్వంచ పట్టణంలో తాగునీరు లీకేజీలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. పైప్‌లైన్, వాల్వుల నుంచి లీకేజీతో విలువైన తాగునీరు వేల లీటర్లు వృథాగా పారుతున్నాయి. ఇందిరానగర్ కాలనీ ఎస్సీ బాలికల గురుకులం ఎదురుగా, నటరాజ్ కూడలి సమీపంలో వాల్వు నుంచి నిత్యం ఇలా నీరంతా వృథా అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అరికట్టాలి.

– పాల్వంచ, న్యూస్‌టుడే

జీఓ నంబరు 97ను రద్దు చేయాలి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా యూనివర్సిటీలో విలీనం చేయడానికి జారీ చేసిన జీఓ నంబరు 97ను రద్దు చేయాలని జైభీమ్ రావు భారత్ పార్టీ(జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి శనివారం నిరసన చేపట్టారు. ఫ్లకార్డులో పట్టుకొని నినాదాలు చేశారు. నాయకులు మల్లికార్జునరావు, వీరునాయక్, వినయ్, బన్నీ, రాజవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న జేబీపీ నాయకులు

పుష్కరాల పనుల్లో వేగం పెంచండి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్న అనంతరం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2027 జూన్, జులైలో కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పుష్కరఘాట్ల నిర్మాణాలను ప్రారంభించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పుష్కరాలకు పది నెలల సమయమే ఉన్నందున పనులన్నీ వేగంగా పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఎండోమెంట్, ఇరిగేషన్, ర.భ శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోదరుల కోసం పల్లెకు వస్తే.. కుమారుడు దాడి చేశాడు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సోదరులకు రాఖీ కట్టేందుకు స్వగ్రామానికి వచ్చిన మహిళపై పాత గొడవల కారణంగా కుమారుడు దాడి చేసిన ఘటన కొమరారం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై పఠాన్ నాగుల్‌మీరా కథనం ప్రకారం.. బోయితండా పంచాయతీ సర్వేతండాకు చెందిన బానోతు తార కొన్నాళ్లుగా కుటుంబ వివాదాల నేపథ్యంలో భర్త పిల్లలను వీడి హైదరాబాద్‌లో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోదరులకు రాఖీ కట్టేందుకు శుక్రవారం గ్రామానికి వచ్చి తల్లిగారింట్లో ఉంది. తల్లి తార వచ్చిన విషయం తెలుసుకున్న కుమారుడు ప్రసాద్ ఊరువిడిచి వెళ్లి మళ్లీ ఎందుకు వచ్చావంటూ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. శనివారం ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీఅడిక్షన్ కేంద్రానికి తరలింపు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి సేవిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఆదేశానుసారం భద్రాచలం డీఅడిక్షన్ సెంటర్‌కు శనివారం తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచలోని టీచర్స్‌కాలనీకి చెందిన సాబీర్.. సీతారాంపట్నం సమీపంలో గంజాయి సేవిస్తున్నాడు. పెట్రోలింగ్ పోలీసులను చూసి పారిపోతుండటంతో పట్టుకొని ఠాణాకు తరలించి విచారించగా గంజాయి సేవించినట్లు ఒప్పుకొన్నాడు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు.

చుంచుపల్లి, న్యూస్‌టుడే: గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను చుంచుపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రవి కుమార్ కథనం ప్రకారం.. విద్యానగర్ బైపాస్ సమీపంలోని ఖాళీ స్థలంలో శనివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు అటుగా వస్తున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి తాగుతున్నట్లు అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఆదేశాలతో భద్రాచలంలోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇల్లెందు, న్యూస్‌టుడే: పట్టణ శివారులో నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను సీఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఆదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఆరోగ్య పరిస్థితి మెరుగు పరిచేందుకు పునరావాస కేంద్రాలకు తరలించారు.

పింఛన్ దరఖాస్తుల గడువు పెంచాలి

కొత్తగూడెం పట్టణం: ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునే గడువు పెంచాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వృద్ధాప్య పెన్షన్స్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఒంటరి మహిళ, వితంతు, గీత, నేత కార్మికులు, దివ్యాంగ, రక్తసంబంధిత వ్యాధులున్న వారికి మాత్రమే ఆసరా పెన్షన్స్ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం వల్ల వృద్ధాప్య పెన్షన్‌దారులు చాలా మందికి అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అన్ని రకాల పెన్షన్స్ పొందడానికి దరఖాస్తుల కోసం మరో రెండు వారాల గడువు పెంచాలని కోరారు.

ఒకటో తేదీనే వేతనాలివ్వాలి

టేకులపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్, ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు మూడ్ బిచ్చు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో జరిగే జిల్లా స్థాయి కార్మిక సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శనివారం టేకులపల్లిలో సమావేశం నిర్వహించి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నాను, పాషా, శ్రీను, రత్నాచారి, యాదగిరి, మోహన్, లక్ష్మయ్య, మాన్‌సింగ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక శనివారం పట్టణంలో జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి రవి పర్యవేక్షణలో పట్టణాధ్యక్షుడిగా టి.ఈశ్వర్, అధికార ప్రతినిధిగా డి. చక్రధర్, ప్రధాన కార్యదర్శి బి. కార్తిక్, ఉపాధ్యక్షుడు ఫణీందర్, ప్రచారకార్యదర్శి లోకేశ్‌ను నియమించారు.

పోరాడి సాధించుకున్నాం

రుద్రంపూర్, కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి యాజమాన్యంతో పోరాడి వివిధ సమస్యలను పరిష్కరించుకున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు గట్టయ్య, వీరాస్వామి అన్నారు. వీకే కోల్‌మైన్ ఉపరితలగనిలో శనివారం ఏర్పాటైన ద్వార సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మె నోటీసును ఇచ్చి ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. సమావేశంలో ప్రసాద్, హీరాలాల్, కుర్ర రమేశ్, మెంగన్ రవి, ప్రభాకర్, కోటి, ఓదెలు, రాజారత్నం, లక్ష్మీనారాయణ, సోములు, తిరుమలరావు, రమేష్, ఏసుపాదం పాల్గొన్నారు.

గెలుపు లక్ష్యంగా గిమ్మిక్కులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గిమ్మిక్కులు చేస్తున్నాయని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాపుకృష్ణ ఆరోపించారు. బస్టాండు సమీపంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ఏఐటీయూసీ 48 హామీలు, ఐఎన్‌టీయూసీ 36 హామీలు ఇచ్చాయని, ఎన్నికలు జరిగి రెండేళ్ల 8 నెలలు కావస్తున్నా నెరవేర్చలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులను ఆకట్టుకునేందుకు కొత్త ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో కుమ్మరి శ్రీను, రాజశేఖర్, విజయ్‌కుమార్, కంచర్ల శ్రీను, మారపాక తిరుపతి, రవివర్మ, సూర్యనారాయణ, వెంకటరెడ్డి, దేవాసింగ్, నవీన్ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులు తగిన చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనుముల సాయి, ఎస్కే ఫహీందాదా డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ మహాసభల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వారు శేషగిరిభవన్‌లో శనివారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని, దీనికోసం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సతీష్, ఖయ్యూం, భూపేష్, నదీం, రవికిరణ్, రాకేష్, నవీన్, అజయ్, రసూల్, అమీర్, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు మానసిక ప్రశాంతతతో విధుల్లో రాణించాలి

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడా పోటీలతో ఉద్యోగుల్లో ఉత్సాహం, మానసిక ప్రశాంతత లభిస్తాయని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. జాతీయక్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న 290 మంది ఉద్యోగులకు వాలీబాల్, టెన్నీకాయిట్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు వయసుతో సంబంధం లేకుండా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీడీ చందన, ఏటీడీవోలు చంద్రమోహన్, భారతిదేవి, రాధమ్మ, ఐటీడీఏ క్రీడల అధికారి గోపాల్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీఓ రాహుల్

పాఠశాలల్లో క్రీడా, తెలుగుభాషా దినోత్సవాలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు జీఎం ఎడ్యుకేషన్ రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడలు, యోగా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాలలోని గ్రంథాలయాన్ని, డిజిటల్ తరగతులను, కంప్యూటర్ విభాగాన్ని, పరీక్షల విభాగాన్ని, మధ్యాహ్న భోజన వంటశాలను జీఎం పరిశీలించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.ప్రభాకర్‌రావు అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రాకేశ్, శేఖర్, సరిత పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందిస్తున్న జీఎం రాజేంద్రప్రసాద్

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ ద్వారానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.సారయ్య అన్నారు. కోయగూడెం ఓసీలో శనివారం జరిగిన ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎల్‌సీ వద్ద సింగరేణి యాజమాన్యంతో ఈనెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో జరిపిన చర్చల్లో 22 అగ్రిమెంట్లు చేయడం జరిగిందని, హక్కుల సాధనలో ఇది సింగరేణి చరిత్రను తిరగరాసిన రోజు అని ఆయన అన్నారు. మెడికల్ బోర్డు, ట్రాన్స్‌ఫర్ నిబంధనల మార్పు, ప్రమోషన్లు, వైద్య సదుపాయాలు, ఖాళీ పోస్టుల భర్తీ, డిపెండెంట్ ఉద్యోగాల వంటి పెండింగ్ సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై వచ్చిన అంగీకారాలను కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, బ్రాంచి సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, మాలోత్ హరిసింగ్, శ్రీనివాస్, బాలు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.సారయ్య

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం పట్టణంలోని నార్త్ సెక్షన్ పరిధిలోని వినాయక విగ్రహాల తరలింపు సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు విద్యుత్ లైన్లు ఎత్తు పెంచేందుకు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈ పి. హేమచంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గాజులరాజం బస్తీ, బూడిదగడ్డ బస్తీ, మెయిన్ ఆసుపత్రి ఏరియా, ప్రభుత్వాసుత్రి ఏరియా, సెవెన్‌హిల్స్ ఏరియా, విశ్వనాథ కాలనీ, ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఆదివారం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి సరఫరా బంద్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: రెండు రోజులుగా జూలూరుపాడు మండలానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్ సమీపంలో పైపులైన్ పగలిపోవడంతో మండలంలోని 24 పంచాయతీలకు సరఫరా నిలిచిపోయింది. కారణంగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రానికి మరమ్మతులు పూర్తవుతాయని అధికారులు చెప్పినప్పటికీ సరఫరా కాలేదు. అధికారులు త్వరతగతిన మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హరిదాస్ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని లచ్చాతండాకు చెందిన సాక్షరభారత్ మండల మాజీ కోఆర్డినేటర్ బాదావత్ హరిదాస్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. హరిదాస్ పదో తరగతి స్నేహితులు కలిసి రూ.30 వేలను శనివారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో భానుకిరణ్, యాదాచారి, సుమన్, రమేశ్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శంకరాచారి, సతీశ్, లీలాప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. పెస్టిసైడ్ గుమస్తాల ఆధ్వర్యంలో రూ.6వేలు అందజేశారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ తిరుపతి వెల్లడించారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, పరిసర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో స్పందించాలని పేర్కొన్నారు. కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవం ఉన్న శిక్షకులు సెప్టెంబరు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చేరని నీటిమట్టం.. ఆయకట్టు ప్రశ్నార్థకం

సుజాతనగర్, న్యూస్‌టుడే

కాకతీయుల కాలం నాటి సింగభూపాలం చెరువు జిల్లాలో పెద్ద చెరువుల్లో ఒకటి. సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో సుమారు 1,250 ఎకరాల్లో విస్తరించింది. కుడి, ఎడమ కాల్వల కింద 1,500 మంది రైతులకు చెందిన 2,300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా ఆగస్టు నాటికి నిండుకుండలా మారే సింగభూపాలం చెరువు ఎల్‌నినో ప్రభావంతో గణనీయంగా వర్షపాతం తగ్గి ఆశించిన స్థాయిలో నీటిమట్టం చేరలేదు. ప్రస్తుతం చెరువులో కుడి కాల్వ వైపు 11, ఎడమ కాల్వ వైపు 14 అడుగుల నీటిమట్టం ఉంది. అలుగు పారాలంటే కుడి కాల్వ వైపు 16, ఎడమ కాల్వ వైపు 21 అడుగులు నీటిమట్టం చేరాలి. గతేడాది ఆగస్టు నాటికి చెరువు నిండు కుండలా మారి మత్తడి పారింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ప్రస్తుతం 12.5 అడుగుల నీరు మాత్రమే చేరింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. వరినారు మడులు వెలవెలబోతూ, పొలాలు బీడులుగా దర్శనమిస్తున్నాయి.

సింగభూపాలం చెరువు పరిధిలోని సుజాతనగర్‌లో సాగు చేయని భూమి

ప్రత్యామ్నాయ పంటలు వేయండి

ఎల్‌నినో ప్రభావంతో చెరువు నిండే పరిస్థితి లేకపోవటంతో తక్కువ నీటి వినియోగంతో పండించే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఇటీవల చెరువును సందర్శించిన సందర్భంలో రైతులకు సూచించారు. పప్పు ధాన్యాలు, కూరగాయాల సాగు వైపు రైతులను మళ్లించాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు.

'అనుసంధానం'తోనే ఊతం

సీతారామ ప్రాజెక్టు కాల్వను సింగభూపాలం చెరవుకు అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. సింగభూపాలం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించటం ఆశలు రేకెత్తిస్తున్నాయి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ఒత్తిడి తేవడంతో జూలూరుపాడు మండలం వినోభానగర్ మీదుగా చెరువులను నింపుతూ పెద్దవాగు ద్వారా సింగభూపాలానికి నీటిని తీసుకొచ్చేలా ప్రతిపాదనలు రూపొందించారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కుమార్ లోథ్

పాల్వంచ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కుమార్ లోథ్ డిమాండ్ చేశారు. పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో శనివారం ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 1,185 మందిని రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 20 ఏళ్లుగా వర్సిటీల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. నాయకులు అరవింద్, శ్రీనివాస్, గోపికృష్ణ, అనీషా పాల్గొన్నారు.

సింగరేణిలో సందడిగా నాటకోత్సవాలు

ఇల్లెందు సింగరేణి, న్యూస్‌టుడే: సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించడంలో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో జేకే కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన నాటకోత్సవాల కార్యక్రమం శనివారం సందడిగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను నాటిక రూపంలో ప్రదర్శించారు. అంబేద్కర్ పోరాటాలు, సామాజిక బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎం వీసం కృష్ణయ్య, సేవా అధ్యక్షురాలు వీసం రమ, ఇన్‌ఛార్జి ఎస్వోటూ జీఎం ఎం.రామదాసు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం, అధికారులు రవికుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu